క్లుప్తంగా

100 మందికి వీల్ చైర్స్ అందజేత



పిడుగురాళ్ల: పట్టణంలోని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలను సోమవారం నిర్వహించారు. రోటరీ క్లబ్ గవర్నర్ శరత్ చౌదరి మాట్లాడుతూ.. రోటరీ క్లబ్ ఆఫ్ లైమ్ సిటీ పిడుగురాళ్ల క్లబ్ సభ్యుల సేవలను అభినందించారు. జానపాడు రోడ్డులోని ఓ మిల్లులో 100 మందికి వీల్ చైర్స్‌ను పంపిణీ చేసి, వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో 115 మంది దివ్యాంగులకు కృత్రిమ జైపూర్ కాళ్లను ఉచితంగా అందజేయడం జరిగిందని తెలిపారు. వీటి విలువ సుమారు రూ.12 లక్షలు ఉంటాయని చెప్పారు. రోటరీ క్లబ్ ఆఫ్ లైమ్ సిటీ పిడుగురాళ్ల అధ్యక్షుడు గుండా అశోక్‌బాబు, సెక్రటరీ నీరుమళ్ల రాజేష్, ట్రెజరర్ గుర్రం కృష్ణకాంత్, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఎంపీకి మహ్మద్ ప్రవక్త జీవిత విశేష గ్రంథం అందజేత



పిడుగురాళ్ల: మీలాద్ ఉన్ నబి పండగ సందర్భంగా నర్సరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణ దేవరాయులకు ముస్లింలు ప్రవక్త జీవిత విశేష గ్రంథాన్ని సోమవారం అందజేశారు. తెలుగుదేశం పార్టీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సయ్యద్ అమీర్ అలీ, గురజాల అధ్యక్షుడు అబ్దుల్లా ఆఫీస్ సాబె, సైదావలి, ఖలీల్, సైదావలి, ఏపీజే సుభాని, షేక్ ఖాశిం షరీఫ్, సయ్యద్ ఖలీల్, షేక్ సైదా, అబ్దుల్లా ఉన్నారు.

హెచ్‌ఎం గంగాభవానికి అవార్డు ప్రదానం



వెల్దుర్తి: తిరుపతిలో జరిగిన సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి వేడుకల్లో 137 మంది ఉపాధ్యాయులకు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం ప్రదానం చేశారు. వెల్దుర్తి కస్తూర్బా గాంధీ బాలికోన్నత పాఠశాల ప్రిన్సిపల్ గంగాభవాని బాయి ఆచార్య దేవోభవ అవార్డుకు ఎంపికైంది. విధి నిర్వహణ, సమాజ సేవలో విశేషంగా కృషి చేసిన గంగాభవానికి ఈ అవార్డు దక్కింది. యువతేజం ట్రస్టు, కలాం విజన్ ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ మనవడు సుబ్రహ్మణ్యం అవార్డులు ప్రదానం చేశారు.

స్వచ్ఛతా హీ పక్షోత్సవాలు

కారెంపూడి: మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో సెప్టెంబర్ 15 నుంచి స్వచ్ఛతా హీ సేవ పక్షోత్సవాలు నిర్వహించనున్నట్లు కారెంపూడి ఎంపీడీఓ జి.శ్రీనివాసరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు విడతలుగా పారిశుద్ధ్యం ఇతర స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించడానికి ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మహాత్మా గాంధీ జయంతి అక్టోబర్ 2న స్వచ్ఛ భారత్ దివస్‌గా జరుపుకుందామని ఈ లోగా గ్రామాన్ని అన్ని విధాలా పరిశుభ్రంగా ఉంచుకోడానికి టీమ్‌లకు పారిశుద్ధ్య కార్మికులకు వ్యర్థాలు ఎక్కడపడితే అక్కడ వేయకుండా సహకరించాలని ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి కోరారు.

యోగాసనాలలో ఆక్స్‌ఫర్డ్ విద్యార్థి ప్రతిభ



పిడుగురాళ్లరూరల్: యోగాసనాలలో ఆక్స్‌ఫర్డ్ విద్యార్థి ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపల్ పి.నరేష్ తెలిపారు. యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ పల్నాడు ఆధ్వర్యంలో ఆదివారం నర్సరావుపేట పట్టణంలో నిర్వహించిన పోటీల్లో 4వ తరగతి విద్యార్థి ఎం. శ్రీను మొదటి స్థానంలో నిలిచినట్లు చెప్పారు. విద్యార్థిని ప్రిన్సిపల్ నరేష్‌తోపాటు పీఈటీ జి.నాగరాజు, వేణుగోపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఈ-పంట నమోదు గడువు పెంపు

రాజుపాలెం: రైతులు పంట నమోదు ఈ నెల 30వ తేదీ లోపు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి పి.వెంకట నర్స య్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులను దృష్టిలో పెట్టుకుని గడువు పెంచినట్లు చెప్పారు. ఈకేవైసీ కూడా చేయించుకోవాలని చెప్పారు. దీంతో బీమా వర్తిస్తుందని, పంటను ప్రభుత్వ మార్కెట్‌ల ద్వారా విక్రయించుకోవచ్చని చెప్పారు.

రహదారులు.. కావాలి మరమ్మతులు



వినుకొండ వెళ్లే రోడ్డులో ఏర్పడిన గుంత



పాడైపోయిన గురజాల వెళ్లే రోడ్డు

కారెంపూడి: మండలంలో పలు రోడ్లకు గుంతలు పడడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కారెంపూడిని కలుపుతున్న గురజాల, నర్సరావుపేట, దాచేపల్లి, వినుకొండ ఆర్‌అండ్‌బీ రోడ్లకు చాలా చోట్ల దెబ్బతిన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు నీరు నిలిచి మరికొంచెం పెద్దవిగా మారాయి. ఇక గ్రామాల్లోని రోడ్లు లేని వీధుల్లో రాకపోకలు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రోడ్లపై ఏర్పడిన గుంతలను గుర్తించి, వాటిని పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

త్వరలో మరమ్మతులు చేయిస్తాం..

త్వరలో రోడ్ల మరమ్మతులు చేయిస్తామని ఆర్‌అండ్‌బీ డీఈ నెల్లూరి గోపీకృష్ణ సోమవారం తెలిపారు. గురజాల వెళ్లే అర్ అండ్ బీ రోడ్డులో 6 కిలో మీటర్లు, అలాగే నర్సరావుపేట వెళ్లే ఆర్‌అండ్ బీ రోడ్డులో 3కిలో మీటర్ల పరిధిలో మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. టెండర్లు పిలిచి, నిర్మాణ పనులు చేపడతామన్నారు. వీటికి మొత్తం రూ.18.90లక్షల నిధులు మంజూరయ్యాయన్నారు. వినుకొండ రోడ్డు సాగర్ కాల్వ బ్రిడ్జి ఆక్విడెట్ వద్ద రోడ్డుకు ఒక లేయర్ తారు వేయాలని రూ. 4 లక్షలకు ప్రతిపాదనలు పంపనున్నామన్నారు. మాచర్ల రహదారికి గతంలో రోడ్డు వేసిన కాంట్రాక్టర్‌కు బిల్లులు రాగానే పనులు జరుగుతాయన్నారు.

నీట మునిగిన పంట పొలాల పరిశీలన



పంట పొలాలను పరిశీలిస్తున్న బృందం

అమరావతి: అమరావతి, వైకుంఠపురం, పెదమద్దూరుకు గ్రామాల్లో నీట మునిగిన పంట పొలాలను భారత పంచాయతీ పరిషత్ జాతీయ అధ్యక్షుడు అశోక్ జాడౌన్, ఉపాధ్యక్షుడు జాస్తి వీరాంజనేయుల బృందం సోమవారం సందర్శించింది. అశోక్ జాడౌన్ మాట్లాడుతూ కృష్ణా, గుంటూరు జిల్లాల్లో వరద నష్టం జరిగిందని, ప్రత్యేకించి విజయవాడలో ఆస్తి నష్టం, మిగిలిన ప్రాంతాల్లో పంటలు పూర్తిగా ధ్వంసమైనట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం నష్ట నివారణ చర్యలకు తగినన్ని నిధులు మంజూరు చేయాలన్నారు. స్థానిక కేంద్ర పురావస్తు శాఖ సంగ్రహాలయం, మహా చైతన్యాన్ని, ధ్యాన బుద్ధ విగ్రహాన్ని సందర్శించారు. రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు 208వ వర్ధంతిని పురస్కరించుకుని వెంకటాద్రి నాయుడు విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. పరిషత్ సంయుక్త కార్యదర్శి గోళ్ల మాల్యాద్రి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై కార్మికులు సంఘటితంగా పోరాడాలి

- స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ కార్యదర్శి రవిశంకర్
- ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ నూతన కార్యవర్గ ఎంపిక



నూతన కార్యవర్గంతో ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు

చిలకలూరిపేట: ఆర్టీసీ సంస్థలో కార్మికులకు ఉన్నన్ని వేధింపులు మరే ప్రభుత్వరంగ సంస్థలోనూ లేవని... ఈ సమస్యలపై కార్మికులు సంఘటితంగా పోరాడాలని గుంటూరు జిల్లా స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ కార్యదర్శి రవిశంకర్ చెప్పారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆర్టీసీ బస్ స్టేషన్ వద్ద యూనియన్ పతాకాన్ని సోమవారం ఆవిష్కరించారు. ముందుగా సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సీఐటీయూ అనుబంధంగా ఎస్‌డబ్ల్యూఎఫ్ స్థాపించటం జరిగిందని చెప్పారు. ఆర్టీసీ సంస్థలో డ్రైవర్లు, కండెక్టర్లపై అనేక వేధింపులు ఉన్నాయని చెప్పారు. ప్రయాణికులు ఎక్కిన వెంటనే టికెట్ ఇవ్వలేదని, అద్దాలు పగిలాయని, టైర్లు పంచర్లు అయ్యాయని డ్రైవర్లు, కండెక్టర్ల వద్ద డబ్బులు వసూలు చేయడం దారుణమన్నారు. అంతేకాకుండా చిన్న చిన్న సమస్యలకు ఫిర్యాదులు నమోదు, ఏళ్ల తరబడి ఇంక్రిమెంట్లు, ప్రమోషన్లు ఆపటంతో పాటు రిమూవల్స్, సస్పెన్షన్లు వంటివి ఆర్టీసీలో సర్వసాధారణంగా మారాయన్నారు. ఆర్టీసీ పని విధానంలో మార్పులు రావాలని, సంస్థ విధివిధానాలు మెరుగుపడాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ తొలి నుంచి పోరాడుతున్నదని వెల్లడించారు. ఇప్పటికైనా ఆర్టీసీలో ప్రైవేటు బస్సులు ఆపి, కొత్త బస్సులు కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సంఘ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ గౌరవ అధ్యక్షుడిగా పేరుబోయిన వెంకటేశ్వర్లు, అధ్యక్షుడిగా వి.యోహాను, కార్యదర్శిగా టి.ఫణి రాజ్‌కుమార్, సంయుక్త కార్యదర్శులుగా వీజీ నాయక్, ఎస్‌కే జిలాని, వైస్ ప్రెసిడెంట్‌లుగా బీఎస్‌రావు, ఎం.విజయశాంతి, ప్రచార కార్యదర్శిగా టి.రోశయ్య, కోశాధికారిగా జీవీ సుబ్బారావు, గ్యారేజ్ కార్యదర్శి ఎస్.సాంబశివరావు, సహాయ కార్యదర్శిగా వి.ఆశీర్వాదంలను ఎన్నుకున్నారు.

• జీవో నంబరు 115 మాకొద్దు!



రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో.115ను వెంటనే రద్దు చేయాలని మండల కేంద్రమైన ఈపూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రంలోని నర్సులు సోమవారం నిరసన తెలియజేశారు. ఈజీవోను తామంతా ఖండిస్తున్నామని, నర్సింగ్ వ్యవస్థను దెబ్బ తీసే విధంగా జీవో ఉందన్నారు. నర్సుల ప్రమాణాలు, విలువలు కాపాడే విధంగా ప్రభుత్వం ఉండాలన్నారు. గ్రామసచివాలయాల్లో పనిచేసే వారిని తీసుకొని మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్‌లోకి పంపించి వైద్యం చేయించే నిర్ణయం ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడేవిధంగా ఉందన్నారు. వెంటనే ఈ జీవోను రద్దు చేసి మాకు న్యాయం చేయాలని నర్సులు డిమాండ్ చేశారు.

–ఈపూరు

జీవోను తక్షణమే రద్దు చేయాలి

శావల్యాపురం: ప్రభుత్వం నూతనంగా అమలు చేసిన జీవో నంబరు 85ను రద్దు చేయాలని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మాణ్యం రాధాకృష్ణన్ డిమాండ్ చేశారు. సోమవారం వైద్యాధికారి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ వైద్యులు చేపట్టిన సమ్మె కార్యక్రమం నేటి నుంచి ప్రారంభమతుందనీ, జీవో రద్దు చేయాలని కోరుతూ సమ్మె బాటకు దిగినట్లు తెలిపారు. జీవో నంబరు 85 వలన పీజీ (ఉన్నత విద్య) చేసే వైద్యులకు గతంలో ఉన్న 30 శాతం 15 శాతం వరకు సడలింపు చేయడం ఎంత మాత్రం తగదన్నారు. ఇలాంటి జీవోల వల్ల భవిష్యత్ తరాలకు చెందిన ఎంబీబీస్ వైద్యులు అన్నీ విధాలుగా ఇబ్బందులు పడతారని వివరించారు. జీవో నంబరు 85 రద్దు చేసే వరకు తామంతా సమ్మె బాటలో ఉంటామన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నాదెండ్ల: సాతులూరు గ్రామంలో పలు అభివృద్ధి పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు బండారుపల్లి సత్యనారాయణ, గ్రామ నాయకులు కలిసి కొబ్బరికాయలు కొట్టి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక గ్రామంలో రూ.కోటి విలువైన పనులు చేపట్టినట్లు తెలిపారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆదేశాల మేరకు పనులు త్వరితగతిన పూర్తి కానున్నట్లు తెలిపారు.

నేడు రక్తదాన శిబిరం

నరసరావుపేట ఈస్ట్: ప్రధాని నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈనెల 17వ తేదీన శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల ఆవరణలో రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కె.జగన్మోహన్‌రెడ్డి సోమవారం తెలిపారు. శిబిరాన్ని గుంటూరు రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్ సహకారంతో ఏర్పాటు చేస్తున్నారన్నారు. శిబిరం ద్వారా సేకరించిన బ్లడ్ యూనిట్లలో 30 శాతం యూనిట్లను ప్రభుత్వ ఆసుపత్రికి అందచేస్తారని వివరించారు. దాతలు అధికంగా పాల్గొని రక్తదానం చేయటం ద్వారా ప్రాణదాతలు కావాలని తెలిపారు.

నేడు వావిలాల జయంతి

సత్తెనపల్లి: స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్ర గాంధీ, సత్తెనపల్లి మాజీ శాసన సభ్యులు వావిలాల గోపాల కృష్ణయ్య 118వ జయంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ మంత్రి అంబటి రాంబాబు కార్యాలయ వర్గాలు సోమవారం పిలుపునిచ్చాయి. పట్టణంలోని వావిలాల గోపాలకృష్ణయ్య స్మృతి వనంలో మంగళవారం ఉదయం 9 గంటలకు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో జరిగే వేడుకల్లో మాజీ మంత్రి అంబటి రాంబాబు ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. నియోజకవర్గ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మున్సిపల్ కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల బాధ్యులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయలని కోరారు.

మందు లేని వ్యాధి!

నాదెండ్ల : గణపవరం ధనలక్ష్మీ స్పిన్నింగ్ మిల్లులో సోమవారం హెచ్ఐవీ ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోని హెచ్ఐవీ విభాగం, క్యాంపు సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కంపెనీలో పని చేస్తున్న ఒడిశా, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు చెందిన వలస కార్మికులు, హైరిస్క్ గ్రూపుల్లో ఉన్న వారికి అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఐసీటీసీ కౌన్సిలర్ కాకుమాను హనుమంతరావు మాట్లాడుతూ హెచ్ఐవీ సంక్రమిత వ్యాధి అని, నివారణ చర్యలతోనే వ్యాధి సోకకుండా జాగ్రత్తలు పడవచ్చన్నారు. కార్యక్రమంలో క్యాంపు ప్రాజెక్టు మేనేజర్ రోహిణి, ఆశా వర్కర్లు షామిన్, లక్ష్మీ, పాల్గొన్నారు.

సీపీఎం శాఖ మహా సభలు

పిడుగురాళ్ల: పట్టణంలోని కన్నెగంటి హనుమంతు భవనంలో సీపీఎం మహా సభలు సోమవారం నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో జెండాను పార్టీ సీనియర్ నాయకులు దేవళ్ల భూలక్ష్మీ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఇటీవల మృతి చెందిన పార్టీ ఆల్ ఇండియా ప్రధాన కార్యదర్శి సీతరామ్ ఏచూరి, పట్టణ సీపీఎం రెండవ శాఖ కార్యదర్శి బుంగా నాగేశ్వరరావు, మాచవరం శాఖ సీనియర్ నాయకులు షేక్ లాలామద్, గురజాల పార్టీ సీనియర్ నాయకులు షేక్ హైన మస్తాన్‌కు మహా సభ సంతాపం తెలియజేశారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏలూరి గోపాలరావు, జిల్లా కమిటీ సభ్యులు తాళ్లూరి పెద్దిరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా పెద్దిరాజు మాట్లాడుతూ... భారత దేశంలో దోపిడీ వర్గ సమాజం ఉన్నంతకాలం వర్గ పోరాటం ఉంటుందని, వర్గ రహిత సహాజం కోసం పోరాటాలను ఉధ్రుతం చేయాలన్నారు. అదేవిధంగా మతోన్మాద శక్తులు పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యదర్శి తెలకపల్లి శ్రీనివాసరావు, సీతరామయ్య, షేక్ బాబు, సంపతి వెంకట కృష్ణ, సుందర్‌రావు, జి. నాగేశ్వరరావు, షేక్ హుస్సేన్, బత్తుల వెంకటేశ్వర్లు, దేవళ్ల భూలక్ష్మీ, గుర్రం కొండమ్మ, రమణ, గుదే భిక్షాలు ఉన్నారు.

డీవార్మింగ్ డే జయప్రదం చేయండి


రొంపిచర్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో నేషనల్ డీ వార్మింగ్ డేను మంగళవారం నిర్వహిస్తున్నట్లు రొంపిచర్ల, వి.రెడ్డిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు డాక్టర్ పి. జగన్ నరసింహారెడ్డి, డాక్టర్ రేవతిబాయిలు తెలిపారు. అన్ని గ్రామాల్లోని ఎలిమెంటరీ, అప్పర్‌ప్రైమరీ, హైస్కూల్లో నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహిస్తారన్నారు. పాఠశాలలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో, కళాశాలలో కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. సంవత్సరం వయస్సు నుంచి 19 సంవత్సరాల పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మధ్యాహ్న భోజనం అనంతరం ఈ బిళ్లలను నోట్లో వేసుకొని చప్పరించటం లేదా నమిలి మింగి నీరు తాగాలన్నారు. సంవత్సరం లోపు పిల్లలకు ఈ మాత్రలు వాడకూడదన్నారు. ఒకటి నుంచి రెండు సంవత్సరాల లోపు పిల్లలకు సగం మాత్ర వేస్తే సరిపోతుందన్నారు. రెండు నుంచి 19 సంవత్సరాల వయస్సు ఉన్న వారికి పూర్తి మాత్రను వేయాలన్నారు. అలాగే పాఠశాలలకు గానీ అంగన్ వాడీ సెంటర్‌లకు గాని వెళ్లని పిల్లలను ఆశ వర్కర్‌లు సర్వే చేసి వారిని గుర్తించి వారికి కూడా ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తారని వైద్యాధికారులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని వైద్యశాఖ సిబ్బందిని ఆదేశించారు.

ఒడిశా కార్మికురాలు ఆత్మహత్య



నాదెండ్ల: అనుమానాస్పద స్థితిలో ఒడిశాకు చెందిన వలస కార్మి కురాలు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గొరిజవోలు గ్రామ రెవెన్యూ పరిధిలోని జ్యోతిర్మయి టెక్స్‌టైల్స్‌లో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ జి.పుల్లారావు తెలిపిన వివరాల మేరకు ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా టూటిపూర్ గ్రామానికి చెందిన డి.జయమ్మ (35) గత ఆరేళ్లుగా మిల్లులో కూలీగా పనిచేస్తూ క్వార్టర్స్‌లో నివాసం ఉంటోంది. భర్తతో విబేధాల కారణంగా కుమారుడు, కుమార్తెతో కలిసి నివశిస్తోంది. కొద్దిరోజుల క్రిందట స్వగ్రామానికి వెళ్లి తిరిగి శనివారం మిల్లుకు వచ్చింది. అదేరోజు నైట్ షిఫ్టులో డ్యూటీ చేసింది. ఆదివారం డ్యూటీకి వెళ్లలేదు. సోమవారం ఉదయం కుమారుడు, కుమార్తెలను మార్కెట్‌కు పంపింది. వారు వెళ్లిన అనంతరం చేతిని కోసుకుని ఆపై ఫ్యానుకు ఉరేసుకుంది. మధ్యాహ్నం 12.10 గంటలకు కుమారుడు, కుమార్తె తిరిగి క్వార్టర్స్‌కు రాగా ఎంత సేపటికీ తలుపులు తీయకపోవటంతో స్థానికులకు తెలిపారు. తోటి కార్మికులు తలుపులు పగలగొట్టి చూడగా ఫ్యానుకు ఉరేసు కుని కనిపించింది. యాజమాన్యానికి విషయం తెలపటంతో, పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. దీనిపై ఎస్సై జి.పుల్లారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొనసాగిన గణేశ్ నిమజ్జనాలు



వల్లభేశ్వరస్వామి ఆలయంలోని మట్టి వినాయకుడు



గణపవరంలో నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథుడు

నాదెండ్ల: మండలంలో గణేశ్ నిమజ్జనాలు సోమ వారం కొనసాగాయి. మండల పరిధిలో 5 విగ్రహాల నిమజ్జనం నిర్వహించారు. గణపవరంలో ఒకటి, గొరిజవోలులో రెండు, సంకురాత్రిపాడులో రెండు విగ్రహాలకు నిమజ్జనం చేశా రు. గణపవరం వైఎస్సార్ స్పిన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేసిన భారీ గణనాథుడికి గ్రామోత్సవం నిర్వహించారు. తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. స్థానిక కుప్పగంజివాగులో నిమజ్జనం చేశారు.

రూ.లక్షలు పలికిన గణపయ్య లడ్డు



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని ఎస్‌బీఐ బ్యాంక్ బజారులో గణేష్ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. చివరి రోజు ఆదివారం నిమజ్జనం సందర్భంగా స్వామి వారి వద్ద ఉంచిన లడ్డూ వేలం పాట నిర్వహించారు. పెద్ద లడ్డూను మక్కెన యూత్ రూ.1.60 లక్షలకు దక్కించుకోగా మదమంచి లక్ష్మీసాయి స్వప్న చిన్న లడ్డూను రూ.2.26 లక్షలకు కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రొంపిచర్ల మండలంలో...

రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెం, రొంపిచర్ల గ్రామాల్లో సోమవారం వినాయక నిమజ్జనోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయకుని పందిట్లో ఏర్పాటు చేసిన లడ్డూ ప్రసాదాలను భక్తులు వేలంలో దక్కించుకునేందుకు పోటీ పడ్డారు. రొంపిచర్ల బీసీ కాలనీలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహం వద్ద 11 కేజీల లడ్డూ ప్రసాదాన్ని బండారు అంకారావు రూ.1 లక్ష రూపాయలకు పాడుకొనగా, 5 కేజీల లడ్డూ ప్రసాదాన్ని బండారు రాంబాబు రూ.1 లక్షా 5 వేల రూపాయలకు పాడుకున్నారు. అలాగే వి.రెడ్డిపాలెం గ్రామంలో వినాయకుని దేవాలయంలో ఏర్పాటు చేసిన 25 కేజీల లడ్డూ ప్రసాదాన్ని రూ.43 వేల రూపాయలకు వనిపెంట హరికృష్ణారెడ్డి దక్కించుకున్నారు. విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి తంగేడుమల్లి బ్రాంచ్ కాల్వలో, నకరికల్లు అడ్డరోడ్డులోని గుంటూరు బ్రాంచ్ కెనాల్‌లో నిమజ్జనం చేశారు. అలాగే విప్పర్ల గ్రామంలోని శ్రీ గంగాపార్వతీ సమేత వల్లభేశ్వరి స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన మట్టి వినాయకుని విగ్రహానికి 10వ రోజు పూజలు నిర్వహించారు. 11 రోజుల పూజల నిర్వహణ అనంతరం బుధవారం నిమజ్జనం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



లడ్డూ ప్రసాదంతో హరికృష్ణారెడ్డి

సంపూర్ణ పోషకాలు తప్పనిసరి

- తల్లులు, చిన్నారుల ఆరోగ్య రక్షణకు చర్యలు
- నెలాఖరు వరకు పౌష్టికాహార వారోత్సవాలు



కట్టావారిపాలెంలో పౌష్టికాహారం పై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ ప్రమీల, కార్యకర్తలు (ఫైల్)

సత్తెనపల్లి: పోషకాహారం ప్రాధాన్యం తెలియక, సరిగ్గా తీసుకోక తల్లులు, పిల్లలు పలు రుగ్మతలకు గురవుతున్నారు. ఆహారంలో సరైన మోతాదులో మాంసకృతులు లేకపోవడం, విటమిన్లు, ఖనిజ లవణాల లోపాల వల్ల ఆరోగ్య సమస్యలు ఎదురవుతున్నాయి. కాల్షియం తక్కువ అయితే ఎముకల్లో పటుత్వం తగ్గుతుంది. పోషకాహార లోపం నివారణకు, రోగ నిరోధక శక్తిని పెంచుకోవడానికి ప్రధానంగా కూరగాయలు, ఆకు కూరలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. దీనిపై ఏటా సెప్టెంబర్‌లో పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహిస్తున్నారు.

ఆకుకూరలే శ్రీరామరక్ష...

గర్భిణులకు, బాలింతలకు తాజా కూరగాయలే ఆరోగ్యానికి శ్రీరామరక్ష అని వైద్య నిపుణులు చెబుతున్నారు. వాటిని నిర్లక్ష్యం చేయడం వల్లే తల్లులు, పిల్లలు పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నారు. దీనికి తోడు పప్పు దినుసులు, పాలు, గుడ్లు, పండ్లు, పండ్ల రసాలతో పాటు మాంసాహారాన్ని తీసుకోవాలి. ప్రధానంగా పప్పు దినుసులు తీసుకుంటే హార్మోన్ల సమతుల్యతను కాపాడే శక్తి పెరుగుతుంది. కూరగాయలు, ఆకు కూరల్లో సూక్ష్మ పోషకాలైన విటమిన్లు, ఖనిజ లవణాలు లభిస్తాయి. వారంలో మూడు రోజుల పాటు విధిగా తీసుకోవాలి. అలాగే సీజన్‌లో లభించే పండ్లు తీసుకుంటే పోషకాలు పుష్కలంగా లభిస్తాయి. ప్రధానంగా గర్భిణులు, బాలింతలు, ఐదేళ్ల లోపు చిన్నారుల తల్లులు తప్పక పోషకాహారం తీసుకోవాలి.

అంగన్‌వాడీలో పౌష్టికాహారం..

నియోజకవర్గంలో సత్తెనపల్లి టౌన్, సత్తెనపల్లి రూరల్, ముప్పాళ్ల, రాజుపాలెం, నకరికల్లు మండలాల్లో 303 అంగన్వాడీ కేంద్రాలు, రెండు మినీ అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో గర్భిణులు 1,914, బాలింతలు 1,634, ఏడాదిలోపు చిన్నారులు 1,902, ఏడాది నుంచి మూడేళ్ల లోపు చిన్నారులు 7,167, మూడు నుంచి ఆరేళ్ల చిన్నారులు 5,656 మంది ఉన్నారు. పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పోషకాహార లోపం నివారణకు కోడి గుడ్లు అందజేస్తున్నారు. నెలకు 25 కోడిగుడ్లు, 2.5 కేజీల బాలామృతం ప్యాకెట్, 2.5 లీటర్ల పాలు పంపిణీ చేస్తున్నారు. అలాగే బాలింతలు, గర్భిణులకు నెలకు మూడు కేజీల బియ్యం, కిలో కందిపప్పు, అరకేజీ ఆయిల్ ప్యాకెట్, ఐదు లీటర్ల పాలు, 25 కోడి గుడ్లతో పాటు రెండు కేజీల రాగి పిండి, కేజీ అటుకులు, 250 గ్రాముల బెల్లం, 250 గ్రాములు ఖర్జూరం, 250 గ్రాములు చిక్కీలు అందజేస్తున్నారు. బరువు తక్కువ ఉన్నట్లు గుర్తించిన చిన్నారులకు అదనంగా ఫీడింగ్ ఇస్తున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

శావల్యాపురం: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు ఇరువురినీ ఘనంతా సత్కరించారు. వీరిలో కుమ్మరి శ్రీనివాసరాజు (శావల్యాపురం జడ్పీ ఉన్నత పాఠశాల గణిత బోధకులు) బిళ్ళ రాజారమేష్ (తుమ్మలకుంట గ్రామం ఎంపీపీ స్కూలు)లు ఉన్నారు. ఇరువురినీ సోమవారం నరసరావుపేట పట్టణంలో జరిగిన పల్నాడు బాలోత్సవం ఆధ్వర్యంలో ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయులు, నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘం నేతలు ప్రత్యేకంగా ఇరువురినీ అభినందించారు.

ఎన్‌టీఆర్, కోడెల నూతన విగ్రహాలు ఆవిష్కరణ

నరసరావుపేట: స్థానిక ప్రకాష్‌నగర్ 11వ వార్డు 60 అడుగుల రోడ్డులో సోమవారం రాత్రి తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు డాక్టర్ ఎన్‌టీ రామారావు, దివంగత మాజీ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావుల విగ్రహాలను ఆ పార్టీ నేతలు ఆవిష్కరించారు. దీనికి ముఖ్య అతిథులుగా ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు, వినుకొండ మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి సయ్యద్ జిలాని, కోడెల తనయుడు కోడెల శివరాం, నల్లపాటి రాము హాజరయ్యారు. రాష్ట్రానికి చేసిన సేవలను కొనియాడారు.

▪శభాష్.. మన్సూర్!

వినుకొండ(నూజెండ్ల) : చవితి సందర్భంగా పట్టణంలోని ఆ కుల వారి బజారులో జరిగిన లడ్డూ వేలంపాటలో పట్టణానికి చెందిన ముస్లిం యువకుడు చెరుకుంపాలెం మన్సూర్ రూ.80 వేలకు లడ్డూను దక్కించుకున్నాడు. లడ్డూను ఊరేగింపుగా మన్సూర్ ఇంటికి తీసుకెళ్లారు.